
ప్రజాశక్తి
శనివారం 12 నవంబర్ 2022
5
విజయనగరం



వాయుసేనలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

భారత సైన్యంలో అగ్ని వీర్-వాయు ఉద్యోగాల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా పురుష, మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి. రామానందం తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్, డిప్లమో పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల 7 నుంచి 23వరకు agnipathvayu.cdac.in వైబ్ సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. విద్యార్హత సైన్స్ విభాగాల్లో ఎంపిసి 50 శాతం పూర్తి చేసి ఉండాలని, లేదా ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, మెకానికల్ ఎలక్ట్రానిక్ ఎలక్ట్రానిక్స్ ఆటో మెకానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలతో స్పెషలైజేషన్ తో మూడు సంవత్సరాలు డిప్లమో కోర్సు 50శాతం ఉత్తీర్ణతో పూర్తి చేసి ఉండాలి తెలిపారు. అభ్యర్థులు 2022 జూన్ 27 నుంచి 2005 డిసెంబర్ 27 మధ్య జన్మించి ఉండాలన్నారు. 2023 జనవరి 18 నుంచి 24 వరకు ఎంపిక ఉంటుందని తెలిపారు.

మోడీ గో బ్యాక్

- వెల్లువెత్తిన నిరసనలు
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మబోమని మోడీ ప్రకటించాలి
- కార్మిక, ప్రజా సంఘాల డిమాండ్



విజయనగరంలో రాస్తారోకో చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ శుక్రవారం జిల్లా అంతటా పలు చోట్ల కార్మిక, ప్రజాసంఘాలు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యాన నిరసనలు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ పై మోడీ ప్రకటన చేయాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు, ఎఐటియుసి నాయకులు బుగత అశోక్, ఐఎన్‌టియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి అదేమీ మోడీ సొంత సొత్తు కాదని అన్నారు. ప్రజల ఆశలను మోడీ పరిగణలోకి తీసుకొని స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇచ్చి వంద శాతం సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌పై మోడీ ప్రకటన చేయకపోతే ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మంత్రి తో స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, కె.సురేష్, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు యుఎస్ రవికుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి, ఎస్ ఎఫ్ ఐ నాయకులు హర్ష, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు, కార్మికులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

బొబ్బిలి : రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ బొమ్మ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పి.శంకర్రావు,ఎం.శ్రీను, మువ్వల శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రానికి తల మాణికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేయడం దుర్మార్గమని అన్నారు. విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోను, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు మోడీని మోడీ ప్రభుత్వాన్ని నిలదీయకుండా మోడీ అడుగులకు జగన్మోహన్‌రెడ్డి మడుగులెత్తడం రాష్ట్రానికి తీవ్ర నష్టమని అన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కె.అప్పన్న, డివైఎఫ్ఐ నాయకులు ఎ.సురేష్ , సిఐటియు నాయకులు ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ప్రధాని విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానిక విద్యుత్తు స్టోర్స్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విభజన హామీలు అమలు చేయని ప్రధాని వెనక్కి వెళ్లాలని వామపక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు కొంచాడ అప్పలనాయుడు, పతివాడ పెదరాంబాబు, కలిశెట్టి శ్రీనివాసరావు, మీసాల లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మోడీ రాకను వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన చేపట్టారు. మోడీ గో బ్యాక్.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దని, ప్రభుత్వంలోనే విలీనం చేయాలని నినదించారు. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా నాయకులు చెలికాని ముత్యాలు, క్వారీ కార్మికుల సంఘం అధ్యక్షులు పోకల భాస్కర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నులక బుజ్జి, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు పొట్నూరు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీధర రాము, ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఎం.రిషి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మోడీ రాకను వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీనివాస్, సిపిఐ నాయకులు ఎ.ఆనందరావు, లక్ష్మి, సిపిఎం నాయకులు రవ్వా ధర్మారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన

విజయనగరం కోట : మోడీ పర్యటనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద మోడీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తరాంధ్రలో ఉన్న విశాఖకు ఏమి మేలు చేశారని విశాఖ పర్యటనకు వస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ప్రశ్నించారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకు కుని ఆయన చిత్రపటానికి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షరీఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.సూర్యనారాయణ, సిహెచ్ వెంకటేశ్వర్లు, చీలికరాజు, చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని కేంద్రం హామీలు

- మోడీ వైఖరితో మరింత గడ్డు పరిస్థితి
- అభివృద్ధికి దూరమైన విజయనగరం, పార్వతీపురం జిల్లాలు
- నేడు విశాఖలో ప్రధాని సభ
- జనాల తరలింపునకు వైసిపి తహతహ



గిరిజన వర్సిటీ భూసేకరణ మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదు. పైగా ప్రధాని మోడీ అవలంభిస్తున్న విధానాల వల్ల జిల్లాలోని అపారమైన ఖనిజ సంపద, సహజ వనరుల వినియోగం లేదు. కొద్దిపాటి ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు కోల్పోవాల్సివచ్చింది. అయినా, పొరుగు జిల్లా విశాఖపట్నం పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీకి బ్రహ్మరథం పట్టేందుకు వైసిపి సిద్ధమైంది. అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా జనాల తరలించేందుకు భారీ సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని నిర్మిస్తామని, ఫుడ్‌పార్కులు, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు ఏర్పాటు చేస్తామని, గిరిజన యూనివర్శిటీని నిర్మిస్తామని, విజయనగరాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేయారు చేస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హామీలు గుప్పించింది. అటు పూసపాటిరేగ తీరంలో పోర్టు, భోగాపురంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని కూడా చెప్పింది. విజయనగరంలో సంగీత, లలిత కళల అకాడమీ ఏర్పాటుకు హామీ ఇచ్చింది. దీంతోపాటు వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని నమ్మబలికింది. కేంద్రం సాయంతో జిల్లాలో తలపెట్టిన మెడికల్ కాలేజీ నిర్మిస్తామని, ఏడాదిలో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. వీటిలో మెడికల్ కాలేజీ నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభం కావడం తప్ప మరేవీ అమలుకు నోచుకోలేదు. ఆ మెడికల్ కాలేజీ నిర్మాణానికి కూడా కేంద్ర ప్రభుత్వ సాయం లేదు. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా మనుగడ సాగిస్తున్నాయి. వర్షాలకు కొదవలేదు. కానీ సాగునీటి వనరులను అభివృద్ధి చేయకపోవడం వల్ల నీరంతా వృథాగా పోతోంది. మన జిల్లాకు వ్యవసాయ రంగం ద్వారా కేవలం 41.2శాతం మాత్రమే వస్తోంది. ఈ వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం సాయం చేయకపోవడంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పనులు పడకేసింది. అటు ఫుడ్ పార్కుల హామీ నెరవేరలేదు. పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ వెనుకబాటు ఉంది. జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేస్తామని, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు హామీ ఇచ్చినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పైగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో జ్యూట్, చక్కెర మిల్లులన్నీ మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో, బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో సుమారు 30వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరోవైపు విజయనగరంలోని విటి అగ్రహారం, బొబ్బిలి గ్రోత్ సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు కనుమరుగయ్యాయి. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామిక రంగంలో రాష్ట్రంలోనే వెనుకబడ్డాయనడంలో సందేహం లేదు. గిరిజన వర్శిటీ అడ్మిషన్లు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రతిపాదికన భవన సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. స్థల గుర్తింపు, సేకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు పేరిట 2203 ఎకరాలకు గాను 2183 ఎకరాలకు క్లియరెన్స్ పూర్తయినప్పటికీ నిర్మాణానికి కేంద్ర సాయం కరువవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాకు కేంద్ర ప్రభుత్వం చేసిన మోసాలు అన్నీ ఇన్నీ కావు. చివరకు భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల శంకుస్థాపన చేస్తారంటూ మంత్రి బొత్స ప్రకటించినా ప్రధాని ముందుకు రాలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రధాని పర్యటనకు ముందే ఈ సమస్యలపై ప్రశ్నించాల్సిన వైసిపి తనకు పట్టనట్టు వ్యహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బిపిఎల్ వారికే విద్యాదీవెన

తల్లుల ఖాతాల్లో పడగానే ఫీజు చెల్లించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను బిపిఎల్ వారికీ మాత్రమే వర్తింప జేయాలని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఆదేశించారు. అనర్హులను కో ఆర్డినేటర్ లాగిన్ లో చూపాలని తెలిపారు. జగనన్న విద్యా దీవెన 4వ క్వార్టర్ సన్నద్ధత చర్యలపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ అధికారులు, జెవిడి కో-ఆర్డినేటర్ల తో శుక్రవారం టీమ్స్ కాన్ఫరెన్స్ ద్వారా మండల వారీగా కలెక్టర్ సమీక్షించారు. దరఖాస్తులను 5 అంచెల విధానం ద్వారా వెరిఫికేషన్ చేయాలని, తల్లులకు వెల్ఫేర్ అసిస్టెంట్ లతో కౌన్సిలింగ్ చేయించాలని సూచించారు. తల్లుల ఖాతాల్లో డబ్బులు పడగానే ఫీజు లు చెల్లించేలా చూడాలన్నారు. పరీక్షల ఫలితాలతో హాల్ టికెట్స్ ను మాపింగ్ చేయాలని, విద్యార్థుల బయో మాట్రిక్ అతంటికేషన్ సచివాలయాల్లో జరగాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ డిడి రత్నం, డిబిసి రామానందం, ఎఎస్‌ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎం.ఎం.సోల్మన్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎఎస్‌పి

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్‌పిగా ఎం.ఎం.సోల్మన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పోస్టు గ్రాడ్యుయేషన్, న్యాయ శాస్త్రంలో పట్టభద్రులైన సోల్మన్ 1991లో ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో రిజర్వు సబ్ ఇన్స్పెక్టరుగా పోలీసుశాఖలో చేరారు. 1999 రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా, 2010లో డిఎస్‌పిగా, 2021లో అదనపు ఎస్‌పిగా ఉద్యోగోన్నతులు పొందారు. విశాఖపట్నం సిటీ, విజయవాడ సిటీ, ఇంటిలిజెన్సు, ఉమ్మడి రాష్ట్రంలోని పోలీసు అకాడమీలోను, పలు తెలంగాణ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ఆయనకు ఎస్‌సి ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, జిల్లా పోలీసు కార్యాలయ ఎఒ వెంకట రమణ, ఆరి పి.మరియన్ రాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా
- పరిష్కారానికి విద్యా శాఖ మంత్రి హామీ



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉందని, ప్రైవేట్ విద్యాసంస్థలు ఐఐటి, నీట్ అంటూ పరుగులు పెడుతుంటే ప్రభుత్వ కళాశాలల్లో మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించలేక నడవలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. ప్రతి జూనియర్ కళాశాలలోనూ ఫ్యాకల్టీ సమస్య ఉందని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు వెంటనే అందజేయాలని, మరుగుదొడ్ల సౌకర్యం సౌకర్యం కల్పించాలని కోరారు. జామి, భోగాపురం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిర్మించాలని, అన్ని జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడలు తక్షణమే నిర్మించాలని, విజయనగరం, గజపతినగరం డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న అమ్మఒడి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్ సూర్య కుమారిని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతినిచ్చారు. స్పందించిన మంత్రి అక్కడి నుంచే విద్యాశాఖ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రుద్రప్రసాద్ విద్యార్థుల పోరాటానికి మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము , వి చిన్నబాబు, సతీష్ దేవ్ సింగ్, సిహెచ్ పావని, తాటినాయుడు, హర్ష, రామకృష్ణ , జిల్లా సహాయ కార్యదర్శులు సౌమ్య , రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే అనుమతులు రద్దు : మంత్రి

విజయనగరం : ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులను రద్దు చేయాలని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఆర్ఐఒ, జిల్లా ఒకేషనల్ అధికారికి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో మంత్రి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, జెసి మయూర్ అశోక్, అర్‌డిఒ సూర్యకళతో సమావేశం నిర్వహించారు. ప్రతి కాలేజీని డివిఇఒ, ఆర్ఐఒ, ఇఇలు కలసి జాయింట్ తనిఖీ చేసి ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంపాలని మంత్రి ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆధునీకరణకు, అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ లో ఉర్దూ టీచర్ పోస్ట్ ఖాళీగా ఉందని, ఉర్దూ ఉపాధ్యాయుడ్ని నియమించాలని కలెక్టర్ మంత్రిని కోరారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం విఫలం

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమె మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దని చెప్పడానికి ఇక్కడి పట్టభద్రుల ప్రతినిధులకు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఈ ప్రాంతపు విద్యావంతుల సమస్యలను, మనోభావాలను శాసనమండలిలో శక్తివంతంగా వినిపించడానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ , ఉపాధ్యాయ , కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు సరి కదా... వాటి అమలు కోరుతున్న వారిపై తీవ్ర నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. పి ఆర్‌సిని తగ్గించడంతో పాటు సిపిఎస్ రద్దు అంశంలో పూర్తిగా మాట తప్పిందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్ కె ఈశ్వరరావు , జిల్లా సహాధ్యక్షులు జి పార్వతి , లక్కవరపుకోట యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఐ.శ్రీనివాసరావు, ఎస్ సన్యాసినాయుడు , నాయకులు గాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 14వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.7కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. శుక్రవారం 40, 41, 44 డివిజన్లలో కాలువలు, రహదారులు, కల్వర్టుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొగ్గుల దిబ్బ ప్రాంతంలో ఉన్న అమరావతి కాలనీలో స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అంశాలకు ప్రభుత్వం అందించే రూ.20లక్షల నిధులతో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా కషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, సుంకరి నారాయణస్వామి, శైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్‌ఛార్జిలు దూబే, వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రామకంఠాల సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

త్వరలో ప్రారంభం కానున్న గ్రామ కంఠాల సర్వే అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. తప్పులకు తావివ్వని రీతిలో, పారదర్శకంగా జరగాలన్నారు. స్వామిత్ర పథకంపై ఇఒఆర్‌డిలు, డిప్యుటీ తాహశీల్దార్లు, మండల సర్వేయర్లు, విర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, యొలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం శిక్షణ జరిగింది. రీసర్వే ప్రక్రియలో ఆయా అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపడుతున్న రీ సర్వేలో, గ్రామ కంఠాల సర్వే అత్యంత కీలకం అని, ప్రతీ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివాదాలు రేకెత్తే అవకాశం ఎక్కువగా ఉందని, సర్వే చేసినప్పుడు ఆయా ఇంటి యజమానులు తప్పనిసరిగా అక్కడ ఉండేలా చూడాలని చెప్పారు. దీనికోసం వారం రోజుల ముందుగానే సంబంధిత యజమానికి నోటీసు ఇవ్వాలని సూచించారు. సర్వే పూర్తి చేసిన తరువాత, వివిధ ప్రక్రియల అనంతరం, ఆస్తులగురించి ఖచ్చితమైన వివరాలతో, యజమానులకు హక్కు పత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేయడం ద్వారా, వారికి ఆస్తులపై శాశ్వత హక్కు కల్పించడమే కాకుండా, బ్యాంకులనుంచి రుణాలను పొందేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిపిఒ నిర్మలాదేవి, సర్వేశాఖ ఎడి టి.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ చదువుకోవడమే ఆజాద్‌కు నివాళి

కలెక్టర్ సూర్యకుమారి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జాతి యావత్తూ నిత్యం స్మరించుకోవలసిన వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ ఎ. సూర్య కుమారి పేర్కొన్నారు. దేశ తొలి విద్యా శాఖా మంత్రి గా పని చేస్తూ అనేక విద్యా సంస్థలను ఏర్పాటు చేశారని, అందుకే వారి జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అబుల్ కలాం ఆజాద్, ప్రముఖ సంగీత విద్వాంసుడు కనకదాస జయంతి వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను శత శాతం అక్షరాశ్యత దిశగా మార్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కనకదాసు గురించి మాట్లాడుతూ టిటిడిలో అన్నమయ్య కీర్తనలకు ఎంతటి విశిష్టత ఉందో కనకదాసు కీర్తనలకు అంతే విశిష్టత ఉందని పేర్కొన్నారు. లీడ్ ఇండియా ప్రతినిధి ఆచార్య వాసుదేవ్ మాట్లాడుతూ మనిషి స్థాయిని పెంచేది విద్య మాత్రమేనని భావించిన అబుల్ కలాం శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించడానికి పరిశోధనా కళాశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ గణపతిరావు, డిఇఒ వెంకటేశ్వర రావు, సిపిఒ బాలాజీ, వయోజన వైద్యాధికారి సుగుణకరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రామనందం, బిసి సంక్షేమ అధికారి యశోధన రావు, ఇడి పెంటోజీరావు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ నాజిర్, ముస్లిం ప్రతినిధులు రహీం, బాషా, కరీం తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'మైనారిటీస్ వెల్ఫేర్ డే' ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి అదనపు ఎస్‌పి (ఆర్మ్ రిజర్వు) ఎంఎం సోల్మన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఐ పి.మరియన్ రాజు, డిపిఒ ఎఒ వెంకట రమణ, కార్యాలయ పర్యవేక్షకులు కామేశ్వరరావు, ప్రభాకరరావు, ఆర్‌ఎస్ఐలు శ్రీనివాసరావు, కేశవరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్‌లాల్, విఇ సత్యనారాయణ, పొట్నూరు శ్రీరాములు, చిప్పాడ శ్రీనివాసరావు, సుందరాడ అప్పారావు, అప్పాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా జట్టు పయనం

విజయనగరం టౌన్ : ఈనెల 12,13 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ సీపక్ తక్రా పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్లు శుక్రవారం పయనమై వెళ్లాయి. రాష్ట్ర పోటీల్లో విజేతలుగా తిరిగి రావాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, వేణుగోపాలరావు, సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి వై.రాజేష్,సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు ఆకాంక్షించి, అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ఉపాధి కల్పనకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉచిత విద్య, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత చదువు కోసం అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులలో నైపుణ్యం పెంచేందుకు స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నైపుణ్యాన్ని పెంచుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. కష్టపడి పని చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగం సాధించిన వారు కష్టపడి పని చేయాలని అన్నారు. డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ స్కిల్ డవలప్మెంట్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉపాధితో పాటు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేస్తామన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్యం, కమిట్‌మెంట్ ఉంటే విజయం సాధించగలమన్నారు. జాబ్ మేళాలో 11 కంపెనీలు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల నాయుడు, రామభద్రపురం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జడ్‌పిటిసి శాంతికుమారి, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం

అత్యున్నత వ్యవసాయ విధానాల ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడంపై జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి దృష్టి కేంద్రీకరించారు. దీనిలో భాగంగా అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలతో ఇంతకుముందే చర్చించి, జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి తగిన సూచనలు చేయాలని కోరారు. ఈ శాస్త్రవేత్తలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చేసిన ఎంతో విలువైన సూచనలను జిల్లాలో అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల కేంద్ర బృందం పర్యటనలో శాస్త్రవేత్తలు తాము గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో వర్షపాతం సమృద్ధిగా ఉన్నప్పటికీ, మే, జూన్‌లో వర్షాలు తక్కువగా కురవడం వల్ల చెరువులు నిండే వరకు రైతులు ఎదురు చూస్తున్నందున ముదురు నారు నాటాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల దిగుబడి తగ్గుతుందని చెప్పారు. మొక్క జొన్న పంట విషయంలో సరైన సమయంలో తడులు ఇవ్వని చోట్ల బాగా పంట దిగుబడి నమోదు అయ్యిందని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు డాక్టర్ నూనె రాజేష్, డాక్టర్ ఎ వెంకట రాధ, డాక్టర్ పసుమర్తి రాజేష్, డైరెక్టర్ ఇక్రిశాట్ డాక్టర్ శ్రీనాథ్ దీక్షిత్, డాక్టర్ రమేష్ సింగ్, డాక్టర్ కౌశల్ గార్గ్, డాక్టర్ యస్ గజానంద్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోసం రుణాలు

బొబ్బిలి : డ్వాక్రా మహిళలు, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రుణాలు మంజూరు చేస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిపుష్టి పెంచేందుకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, వైఎస్ఆర్ చేయూత, ఆసరా రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. నెలాఖరులోగా ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్ ఏర్పాటు చేసి వచ్చేనెల మరొకటి ప్రారంభిస్తామన్నారు. ఆయా మండలాల్లో విజయవంతం అయితే అన్ని మండలాల్లోనూ ప్రారంభిస్తామన్నారు.

డిపిఒ ఆకస్మిక తనిఖీలు

గజపతినగరం : పురిటిపెంట సచివాలయాన్ని శుక్రవారం డిపిఒ జి.ఎస్.నిర్మలాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అందుతున్న ఇ-సేవలు గురించి ఆరా తీశారు. సచివాలయ పరిధిలో 167 సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా విస్తృత పరచాలని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పకుండా అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని, ఇంటి పన్నులు కూడా సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శి జి.రెజినా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు

మెంటాడ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఆర్.చంటి అన్నారు. మెంటాడ యూనియన్ బ్యాంకులో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం బి.దేవుడుబాబు జ్యోతిప్రజ్వలన చేశారు. బ్యాంకు మేనేజర్ చంటి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 65 పైసల వడ్డీకే వ్యవసాయ, బంగారు, ముద్ర రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. వివిధ రకాల బీమా సౌకర్యాలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు పిఒ బంటుపల్లి చిట్టిబాబు, సిబ్బంది మురళీ, గండ్రేటి చంద్రిక దీపిక, వి.దేవతరాజు, వి.జనార్దనరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరుపై ఆరా

రేగిడి : సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు ఆరాతీశారు. మండలంలోని పెద్దశిర్లాం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. బయోమెట్రిక్ అమలు తప్పనిసరిగా చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇల్లు నిర్మించిన వారికి బిల్లులు చేయాలని ఆదేశించారు.

సోలార్ దీపాలు పంపిణీ

కొత్తవలస : శారదా కంపెనీ పరిధిలో ఉన్న ఐదు పంచాయతీలకు సోలార్ లైట్స్ పంపిణీ చేసినట్లు కంపెనీ సీనియర్ హెచ్ఆర్ జిఎం ప్రభాత మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐదు పంచాయతీల్లో 14 గ్రామాల్లో 72 సోలార్ లైట్స్, 100 ఎల్ఇడి లైట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవలత, విఆర్ఒ కె.మహేశ్వరరావు, నాయకులు మదిన అప్పలరాం, కొటకాపల్లి సర్పంచ్ కృష్ణ, పరిశ్రమ నుంచి హెచ్.సన్యాసిరావు (హెచ్ఆర్ డిజిఎం), జి.శంకరరావు (హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్), కె.సంతోష్ కుమార్ (హెచ్ఆర్ ఆఫీసర్) తదితరులు పాల్గొన్నారు.

'చిట్టి గురువులు'పై అవగాహన ర్యాలీ

వేపాడ : మండల కేంద్రం వేపాడలో చిట్టి గురువులు కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నదే చిట్టిగురువులు కార్యక్రమం లక్ష్యమన్నారు. తల్లిదండ్రులకు పిల్లలు చదువు నేర్పించాలని కోరారు. బిఎల్ఒ తాతబాబు, అంగన్వాడీ కార్యకర్త మంగ లక్ష్మి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వేపాడలో ఫ్యామిలీ డాక్టర్

వేపాడ : మండల కేంద్రం వేపాడలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ఎ.ధరణి 85 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రమణ, హెచ్‌వి సాయిరెడ్డి, ఎఎన్ఎం దేవి, డెటా ఎంట్రీ ఆపరేటర్ మోహన్, ఆశాలు పార్వతి, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

యూనిఫాం తప్పనిసరి

వేపాడ : విద్యార్థులంతా తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆరిగిపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ కలిగేలా విధంగా పాఠశాల ఆవరణంతా ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

13న వయోజనులకు పరీక్ష

నెల్లిమర్ల : చిట్టి గురువులు కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన వయోజనులకు ప్రాథమిక స్థాయి మదింపు పరీక్షను ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.గిరిబాల తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశాలు, అంగన్వాడీలు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి మదింపు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరక్షరాస్యులంతా హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వివిధ మాధ్యమాల ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఎంఎఒ అల్లి మురళీకృష్ణ, ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మేలు

రేగిడి : ఫిజియోథెరపీతోనే వికలాంగులకు మేలని ఫిజియోథెరపిస్టు బి.లక్ష్మీ ప్రసన్న, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు తెలిపారు. శుక్రవారం రేగిడి విద్యా వనరుల కార్యాలయంలో వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యుల సూచించిన ఫిజియోథెరపీని ఇంటి వద్ద రెండు పూటలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, ఆర్.రాంబాబు, కేర్ టేకర్ అనూరాధ, సిఆర్‌పిలు వెంకటరమణ, మోహనరావు, చంద్రరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నివారణ

బొబ్బిలి : అవగాహనతో సైబర్ నేరాలను నివారించవచ్చునని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు, ఆధార్, ఒటిపి వివరాలు గుర్తు తెలియని వ్యక్తులతో షేర్ చేయకూడదన్నారు. అనుమానిత వ్యక్తుల వద్ద బయోమెట్రిక్ వేయవద్దన్నారు. లాటరీ వచ్చిందని, రుణాల కోసం వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు.


విద్య ద్వారానే ప్రగతి

బొబ్బిలిరూరల్ : విద్య ద్వారానే ప్రగతి సాధించవచ్చని నారాయణప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సి రాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు, రేపు పౌరాణిక నాటక పోటీలు

బొబ్బిలి : స్థానిక కళాభారతి ఆడిటోరియంలో శనివారం, ఆదివారం రాజా రావు శ్వేతాచలపతి రంగారావు బహదూర్ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో పౌరాణిక పద్య నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు యువ రాజా బేబినాయన తెలిపారు. పోటీలలో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ కళాకారులు యడ్ల గోపాలరావు, నంది అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, సీనియర్ కళాకారులు గురిచింది ఆదినారాయణతో పాటు 100మంది కళాకారులు హాజరవుతారన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు..




డెంకాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-డెంకాడ

గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చెప్పారు. మండలంలోని చల్లంగిపేట సచివాలయ పరిధిలో డి.కొల్లాం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారికి చేకూరుతున్న లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. తన నిధుల నుంచి ప్రతి సచివాలయానికి మరో రూ.10 లక్షల నుంచి 15 లక్షలు ఇస్తానని చెప్పారు. ఈ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, జెడ్‌పిటిసి బడుకొండ లక్ష్మి, ఎఎంసి వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఎపిఎం విజయలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఎన్.అప్పలనాయుడు, సర్పంచులు అట్టాడ శివకృష్ణ, కోరాడ కనకరాజు, ఎంపిటిసి కిరణ్ కుమార్, నాయకులు బుజ్జిబాబు, డీలర్ రాజు, అప్పారావు, చిక్కాల జనార్దన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని ముసిరాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను, గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో పాలనా వ్యత్యాసాలను వివరించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి మెరుగైన సేవలు అందించడం ద్వారా పేదల జీవన



కొత్తవలస.. పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ప్రమాణాలు మెరుగయ్యాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, కొత్తవలస, వేపాడ ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, సర్పంచ్ చింతల రాములమ్మ, ఎంపిటిసి ఒబ్బిన వరలక్ష్మి, మాజీ సర్పంచ్ చింతల పైడినాయుడు, నాయకులు గొరపల్లి రవి, పల్ల భీష్మ, జామి ఈశ్వరరావు, గణేష్, విరోతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం బాడంగిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి తెలియజేసిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, తెంటు మధు, తదితరులు పాల్గొన్నారు.

అంబాడ సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రేగిడి : మండలంలోని అంబాడ వెంకటాపురం పంచాయతీ సమస్యలపై ఎమ్మెల్యే కంబాల జోగులుకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అంబాడ వెంకటాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ సమస్యలను ఆయన దృష్టికి



రేగిడి.. పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల



బాడంగి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తీసుకెళ్లారు. డ్రెయిన్లు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తాగునీటి ఎద్దడి ఉందని, పైపులైను ద్వారా తాగునీరు ఇప్పించాలని కోరారు. పెద్ద శిర్లాం నుంచి అంబాడ వెంకటాపురం వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాలంటీర్లు పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని వాలంటీర్లను తొలగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రత్యేక బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. కొందరికి అర్హత ఉండీ సంక్షేమ పథకాలు అందకపోవడాన్ని గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్, మండల విప్ శ్రీనివాసరావు, లంక రాంబాబు, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంఇఒ వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నిరంతర నిఘా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ధాన్యం సేకరణ, రవాణా విషయాల్లో అవినీతికి తావులేకుండా నిరంతర నిఘా ఉండాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు.. వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయశాఖ భవనంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణ, ప్రకృతి వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు, డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్లు, కస్టమర్ హైరింగ్ సెంటర్లు, ఆర్‌బికెల ద్వారా సరఫరా చేసిన ఎరువులు, విత్తనాలు, పంటల మద్దతధర, తదితర విషయాలపై ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ నెలలు రైతులకు ఎంతో కీలకమైనవని చెప్పారు. రైతుల చేతికి పంట అందివచ్చే సమయం ఆసన్నమైందన్నారు. వారు పండించే ప్రతి గింజా నష్టపోకుండా చూసి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సలహా మండలి చైర్మన్ చినబాబు, సభ్యులు ఆవతారం, సతీష్, నాగరాజు, సర్పంచులు ఈశ్వరరావు, వెంకటరమణ, సూర్యనారాయణ, ఎంపిటిసి దేముడు, రామచంద్రరావు, వేపాడ వైస్ ఎం.పి.పి ఈశ్వరరావు, మాజీ సర్పంచులు సత్యారావు, కనకం, కె.వెంకటరావు, బుజ్జి, మాజీ ఎంపిటిసి బోజంకి గోవింద్, నాయకులు రవి, సతీష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో చైర్మన్ జమ్ము అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎఒ పూర్ణిమ మాట్లాడుతూ 4683 ఎకరాల్లో ఇ-పంట నమోదు చేసినట్లు తెలిపారు. రైతులు రబీలో మినుమలు, పెసలు, రాగి, వరి, వేరుశనగ విత్తనాల కోసం ఆర్‌బికెలో నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉన్న రైతులు ఆర్‌బికెలో విఎఎలను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంపిడిఒ గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్.భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : పురిటిపెంట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు మాట్లాడుతూ ప్రతి రైతుకు పథకాలు అందేలా చూడాలని అన్నారు. ఇ-క్రాప్ సంపూర్ణంగా పూర్తి చేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్లను అభినందించారు. ఎడి కె.మహారాజన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎఒ సిహెచ్.ధనలక్ష్మి మాట్లాడుతూ రబీ సాగుకు అపరాలు అందుబాటులో ఉంచామన్నారు. ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్, పశువైద్యాధికారి వెంకటరమణ, విఎఎలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపునకు
15 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 15 నుంచి ఇంటింటి సర్వే చేసి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా కుష్టువ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభ కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈనెల 15నుంచి ప్రారంభం కానున్న కుష్టు ఇంటింటి సర్వేకు సంబంధించి, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఒ రామేశ్వరి ప్రభ మాట్లాడుతూ, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే కుష్టువ్యాధిని నియంత్రించగలమని అన్నారు. ప్రతి ఇంటికీ ఆశా వర్కర్, వలంటీర్ వెళ్లి, ప్రతీఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉందని చెప్పారు. లక్షణాలు కనిపిస్తే, వారికి తదుపరి కుష్టునిర్ధారణా పరీక్షలను చేయించాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, ఐసిడిఎస్ పిడి బి.శాంతకుమారి, డిఐఒ డాక్టర్ నారాయణ, డ్వామా, మెప్మా, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, మున్సిపాల్టీ అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనకు విస్తృత ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విడిగా అందించాలి

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

తడి, పొడి చెత్తలు విడిగా అందించాలని సర్పంచ్ కోరాడ మహేష్ సూచించారు. శుక్రవారం రీమా పేట పంచాయితీ పరిధి ఉమా మహేశ్వర నగర్, అంబటి వలస ప్రాంతాల్లో సర్పంచ్ మహేష్ 750 ఇళ్లకు రెండు డస్ట్ బిన్‌లు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు డస్ట్ బిన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా బుట్టలో వేసి అందించాలని ఆయా ప్రాంతాల ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కోరాడ రాజేష్, వాలంటీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

హుదా సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలకు గుర్తింపు లభించింది. జాతీయ మైనారిటీ దినోత్సవం సందర్భంగా బొబ్బిలి హుదా ముస్లిం వెల్ఫేర్ సొసైటీకు ఉత్తమ సేవా పురస్కారాన్ని డిఆర్ఒ గణపతిరావు అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పేద ముస్లిముల అభివృద్ధికి హుదా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ పని చేస్తుందని, సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. సొసైటీ అధ్యక్షులు మహమ్మద్ రఫీను సత్కరించి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఇంతియాజ్, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాడంగి

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్నిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను స్థానిక జెడ్‌పి ఉన్న పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ఈపోటీలను ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని తెలిపారు. క్రీడలకు నిర్వహణకు సహకరించిన వారికి పాఠశాల తరపున హెచ్ఎం త్రినాథరావు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం చేశారు. వివిధ క్రీడాంశాల్లో 620 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శంబంగి వేణు, జెడ్‌పిటిసి, వైస్‌ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంఇఒలు స్కూలు గేమ్స్ సెక్రటరీ ఎల్‌వి రమణ, చీఫ్ కోచ్ ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు నగరపాలక సంస్థ విద్యా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించడం అభినందనీయమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో బాలల దినోత్సవ వేడుకలను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ ఆర్.శ్రీ రాములునాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. సెల్ఫోను ఒక్కటే ఆనందాన్ని ఇచ్చేది కాదని. అటు ఆటలలో ఇటు పాటలలో అన్నింటిలోనూ పిల్లలు ఆసక్తిని చూపించాలన్నారు.

కరాటేలో సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

విజయనగరం : స్థానిక తోట పాలెంలోని సత్య డిగ్రీకళాశాలలో కోచ్ కె.సంతోష్ కుమార్ అధ్వర్యంలో జిందాల్ కంపెనీ-ఒకినావా స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్స్ కరాటే డోజో ఆధ్వర్యంలో జరిగిన ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలు సాధించారు. విజేతలకు సినీ నటుడు కె.సుమన్ బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్యవేణి, అధ్యాపకులు అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో శశిభూషణరావు

కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, విద్యా కమిటీ సభ్యులు తాళ్లపూడి సంతోషి కుమారి, బాలి పద్మావతి పాల్గొన్నారు.

స్థాయికి తగ్గ బోధన అందించాలి

జిల్లా సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు



విద్యార్థుల విద్యాప్రమాణాలను తెలుసుకుంటున్న సూర్యారావు

ప్రజాశక్తి-విజయనగరం

వికలాంగ విద్యార్థుల ప్రజ్ఞా స్థాయికి తగ్గ బోధన చేయాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు అన్నారు. శుక్రవారం స్థానిక కల్యాణంద భారతీ నగర పాలక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సూర్యారావు వికలాంగ విద్యార్థుల స్థాయిలను పరీక్షించేందుకు వారితో పలు కార్యకలాపాలను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యం, ఆటిజం గల పిల్లల్లో ప్రజ్ఞాస్థాయిలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. వారికి తగిన బోధనోపకరణాలు ఉపయోగించి అభ్యాసం చేయించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఈ పిల్లలకు విద్యతోపాటు జీవిత సంబంధ, భాషణ నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు కూడా వికలాంగ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తద్వారా వారికి మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని తెలిపారు. ప్రతీ మంగళవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నామని, దానిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు ఎన్.బంగారునాయుడు, ఎస్.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో భర్తవానిపాలెంలో పాడి రైతు దేవుపల్లి దేవుడు మరణించడంతో విశాఖ డెయిరీ సంక్షేమ పథకం నుంచి బీమా నగదును శుక్రవారం అందజేశారు. బీమా నగదు రూ.30 వేల చెక్కును ఆయన భార్య దేవుడమ్మకు అందించారు. పశువులు మరణించిన రైతులు పోతల సన్యాసమ్మకు రూ.24 వేలు, దేవుపల్లి సత్యవతమ్మకు రూ.63 వేలు బీమా మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు పోతల వెంకటరమణ, సూపర్‌వైజర్ ఎం.నాయుడుబాబు పాల్గొన్నారు.



బీమా నగదు అందజేస్తున్న పి.వెంకటరమణ



కౌన్సిలర్‌ని పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి సన్యాసినాయుడు

ప్రసాద్‌కు జెడ్‌పిటిసి పరామర్శ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్‌ను జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు పరామర్శించారు. ఇటీవల వివాదంలో మైపాడ ప్రసాద్‌కు గాయాలై మిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం జెడ్‌పిటిసితోపాటు మొయిద పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ కనకారావు, ఎం.సూరిబాబు ప్రసాద్‌ని పరామర్శించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

శృంగవరపుకోట : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. రాజీ ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని జడ్జి తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఎమ్‌పి నిధులతో నియోజకవర్గంతో పాటు దత్తిరాజేరు మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ హామీనిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ఎమ్‌పితోపాటు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులతో ప్రగతి నివేదికలు వినిపించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య సూచించారు. సమన్వయం లోపం అయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి తహశీల్దారు రమేష్, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి వేపాడ

స్థానిక సుస్థిర వ్యవసాయ కేంద్రాన్ని రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులు ముందుగా అన్ని రకాల విత్తనాలను పరిశీలించుకోవాలని, ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని చెప్పారు. అనంతరం ఆయన బొద్దాం గ్రామంలో దేశీయ వరి, బర్మా బ్లాక్‌ఫీల్డ్‌ను పరిశీలించారు. అనంతరం జగ్గయ్యపేట, గుడివాడలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఆర్‌డిఎస్ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సిఎస్ఎ రీజనల్ కోఆర్డినేటర్ పి.వెంకట్రావు, త్రిమూర్తులు, సిఎస్ఎ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న వ్యాను

యువతి మృతి

భోగాపురం : జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో యువతి (25) మృతి చెంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదం లింగాలవలస జంక్షన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు కారులో వెళ్తున్న కొంతమంది టిఫిన్ కోసం జాతీయ రహదారిపై కారును ఆపి వెళ్లారు. యువతి వెళ్లకుండా కారులోనే ఉండిపోయింది. ఇంతలో వెనుక నుంచి పార్సిల్ వ్యాన్ బలంగా కారును ఢీకొంది. దీంతో యువతి కార్లో చిక్కుకుంది. ఇంతలో హైవే పోలీస్ వాహనం చేరుకొని స్థానికుల సహకారంతో ఆమెను బయటికి తీశారు. పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు.